క్లుప్తంగా

పనిగంటల పెంపును ఉపసంహరించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: రాష్ట్ర అసెంబ్లీ చేసిన పది గంటల పనిదినాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా పని గంటలు పెంచిందని, యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయని ఆరాట పడుతున్న కూటమి నేతలకు కార్మికుల ఇబ్బందులు పట్టడం లేదన్నారు. తక్షణమే అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గడగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, టీఎల్ పద్మ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆదాయం, ఆరోగ్యం


చిరుధాన్యాల విత్తనాలు, ఎరువులు, యంత్రాలను రైతులకు అందజేసిన శాస్త్రవేత్తలు

సామర్లకోట: చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆదాయంతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెద్దాపురం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చిరుధాన్యాల సాగు చేసే విత్తనాలు, ఎరువులను, యంత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చిరుధాన్యాలలో అనేక రకమైన విటమిన్లు ఉన్నాయని తెలిపారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టరు శర్మ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగులో పురుగులు, తెగుళ్ల వాటిని సులభంగా నివారించుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం డాక్టర్ రామభద్రరాజు, శాస్త్రవేత్తలు డాక్టరు సుధీర్, సుజాత, డాక్టరు దయాల్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు. షెడ్యూల్డు కులాల రైతులకు చిరుధాన్యాల విత్తనాలు, ఎరువులు, యంత్రాలను ఉచితంగా అందజేశారు.

కరాటేలో 'కోట' విద్యార్థుల ప్రతిభ


విజేతలతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: విశాఖపట్నంలో ఈనెల 21న జరిగిన సౌత్ ఇండియా కరాటే టోర్నీలో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు కోచ్ శంకర్ తెలిపారు. ఈ పోటీల్లో సామర్లకోటకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఉన్నట్లు ఆయన చెప్పారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో విజేతలకు అభినందన సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసు ముఖ్య అతిథిగా పాల్గొని దశాబ్ద కాలంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ శంకర్‌ను అభినందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ, సామర్లకోటల నుంచి 102 మంది విద్యార్థులు టోర్నీలో పాల్గొనగా 46 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో ఏడు స్వర్ణ పతకాలు, 11 రజత పతకాలు, 28 కాంస్య పతకాలు సాధించాన్నారు. దాంతో ఉమ్మడి జిల్లాకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ వచ్చిందని తెలిపారు. వీరిలో 20 మంది సామర్లకోటకు చెందినవారని వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి బడుగు బాబి, కోశాధికారి ఏలేటి రమేష్‌లతో పాటు కాకినాడ, రాజమహేంద్రవరం కోచ్‌లు ఎం.ప్రసన్నకుమార్, కె.బద్రి, కె.జానకిరామ్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ


పోటీలో రన్నర్స్‌గా నిలిచిన హరికృష్ణ, చరణ్‌రామ్

సామర్లకోట: హర్యానా రాష్ట్రం పంచకులలో ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకూ జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ అశ్విని గుప్తా మెమోరియల్ ఆలిండియా సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ జంట ప్రతిభ కనబర్చిచి రన్నర్‌గా నిలిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరంరెడ్డి నాని తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్ బ్యాడ్మింటన్ అకాడమిలో శిక్షణ పొందుతున్న హరికృష్ణ, చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ జంట ఈ పోటీల్లో పాల్గొన్నారు. దాంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన జంట ఈ విజయం సాధించాయి. త్వరలో చైనాలో జరుగబోయే ఆసియన్ గేమ్స్‌కు అర్హత సాధించినట్టు నాని తెలిపారు.


ప్రత్యేకాలంకరణలో పురుహూతిక అమ్మవారు


స్కందమాతగా తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు


గొల్లప్రోలు మండలం చెందుర్తిలో చందనదేవిగా లలితాదేవి


హంసవాహిని అలంకారంలో మహాలక్ష్మి దేవి


నూకాలమ్మ ఆలయంలో గాయత్రీదేవి అవతారంలో దర్శనం

బహురూపీ.. జగదంబికే..


పిఠాపురం మహాలక్ష్మిదేవి ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు


భువనేశ్వరి పీఠంలో గాయత్రీదేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు


బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి


కొమరగిరిలో గాజుల అలంకారంలో బాల కనకదుర్గ


కొత్తపల్లిలో శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారు

- వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం
- ఘనంగా నవరాత్ర ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం మంగళవారం భక్తులు కిటకిటలాడారు. నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గమ్మ ఆలయాలలో రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహిరచగా పిఠాపురం రాజరాజేశ్వరీ దేవి బాలా త్రిపుర సుందరిగా, అష్టాదశ శక్తి పీఠమైన పురుహూతిక అమ్మవారికి మహాగణపతి, దత్తాత్రేయ, శ్రీకుక్కుటేశ్వరస్వామి వార్లకు అభిషేకములు, కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన నిర్వహించారు. పిఠాపురంలోని మహాలక్ష్మి అమ్మవారు హంస వాహినిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలోని లలితాదేవి అమ్మవారు చందనధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైన అపర్ణాదేవి స్కందమాతగా నిమ్మకాయల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పోటెత్తిన భవానీలు

పాదగయ క్షేత్రానికి భవానీ దీక్షాధారులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి వారి రాకతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రదాలు ఏర్పాటు చేశారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ, వర్జుల వారి వీధిలోని భువనేశ్వరీ పీఠంలో భువనేశ్వరి అమ్మవార్లు మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు రాంబాబురెడ్డి, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో, భువనేశ్వరీ పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలోని కనకదుర్గ అమ్మవారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విద్యుద్దీపాలతో ఆలయాలను అలంకరించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కొమరగిరిలో బాల కనకదుర్గ అమ్మవారిని గాజులతో అలంకరించారు.

సమస్యలు పరిష్కరించాలి

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ సిబ్బంది నిరసన


సామర్లకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

సామర్లకోట: సచివాలయాల సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిబ్బంది నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల వద్ద మండల ఏఓ సతీష్‌కు వారి సమస్యలపై సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈనెల 25వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నట్టు వారు తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టనున్నట్టు వారు తెలిపారు. అలాగే 27న మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాల అందజేత, 28న విశాఖలోని ప్రాంతీయ సభ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ శంఖారావం, 29న సామాజిక పింఛన్ల పంపిణీ నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసిన తరువాత అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగనున్నట్టు వారు తెలిపారు. అక్టోబరు 1న యాథావిధిగా నల్ల బ్యాడ్జీలు ధరించి పింఛన్లు అందజేస్తామని వారు తెలిపారు. అక్టోబర్ మూడున మండల, మున్సిపల్ స్టీరింగ్ కమిటీల సన్నాహక సమావేశం, 4న జిల్లా స్టీరింగ్ కమిటీల సన్నాహక సమావేశంలో పాల్గొంటామని తెలిపారు.

అక్టోబరు 5న చలో రాజమహేంద్రవరం..

అక్టోబరు 5వ తేదీన చలో రాజమహేంద్రవరం నిర్వహించి రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి ఉద్యోగుల నియమ నిబంధనలకు కట్టుబడి కార్యాచరణతో ముందుకు వెళ్తామని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ప్రతినిధులు వీరమల్ల లోవరాజు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం

- ఏపీఎన్జీఓల సంఘ జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ
- సామర్లకోట యూనిట్ అధ్యక్షునిగా స్వామి


నూతన కమిటీతో జిల్లా ఎన్జీఓల సంఘ ప్రతినిధులు

సామర్లకోట: ఉద్యోగుల సమస్యలపై ఏపీఎన్జీఓల సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన సంఘ సామర్లకోట యూనిట్ ఎన్నికల ప్రక్రియలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 52 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సంఘం ఉద్యోగులకు అండగా ఉంటుందని, సామర్లకోట యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం ఆనందంగా ఉందని తెలిపారు. కరప యూనిట్ అధ్యక్షుడు బీఆర్వీ చౌదరి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. యూనిట్‌లో పదవులకు ఒకటి చొప్పున నామినేషన్లు రావడంతో ఎన్నిక ఏక గ్రీవం అయిన్నట్టు చౌదరి ప్రకటించారు. యూనిట్ అధ్యక్షుడిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఎంఎస్ఆర్ స్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా మున్సిపల్ కార్యాలయ ఆర్వో పీవీ నూకరాజు, ఉపాధ్యక్షులుగా ఆర్.జెమినాకుమారి (వేట్లపాలెం పీహెచ్‌సీ), టి.సత్య నారాయణ (మాధవపట్నం పంచాయతీ కార్యదర్శి), పి.చరణ్‌కుమార్, కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసు (వేట్లపాలెం పీహెచ్‌సీ), సహాయ కార్యదర్శులుగా ఎన్జీ రత్నకుమారి, ఎస్కే రేష్మా, వి.లక్ష్మణస్వామి, మహిళా సహాయ కార్యదర్శిగా డి.రమాకుమారి, కోశాధికారిగా ఎ రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కె.కేశవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కేవీవీ సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా ఉపాధ్యక్షులు సరేళ్ల చంద్రరావు, కేవీఎస్వీ ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి టి చార్లెస్ పాల్‌లు పాల్గొన్ని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నేడు వైద్య శిబిరం

సామర్లకోట: స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ శిబిరాన్ని బుధవారం అచ్చంపేటలో నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి మణికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వేట్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అచ్చంపేట కాపు కల్యాణ మండపంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్తపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సామర్లకోట: పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ సమయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాధవపట్నం పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ అన్నారు. మంగళవారం పంచాయతీ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడకు అతి సమీపంలో మాధవపట్నం పంచాయతీ ఉండటం వలన తరుచూ జిల్లా పంచాయతీ అధికారి తనిఖీలకు వస్తుంటారని, ఈ మేరకు గ్రామంలో చెత్త, డ్రైన్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఈ మేరకు కార్మికులు ఇంటింట తడి, పొడి చెత్తలను సేకరించాలని, రోడ్లపై చెత్త వేసేవారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సతీష్, శానిటరీ మేస్త్రీ కర్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇల్లు కూలి మూడు కుటుంబాలు నిరాశ్రయం


కూలిపోయిన ఇంటిని పరిశీలించిన కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: వారం రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక 13వ వార్డు బలుసులపేట లోని ఇల్లు సోమవారం రాత్రి కూలిపోయింది. దాంతో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ఎడ్ల కోటయ్య, ఎడ్ల నూకామణి, ఎడ్ల శ్రీను కుటుంబాలు నివసిస్తున్న ఆ పెంకుటింటి పై కప్పు నుంచి సోమవారం రాత్రి శబ్దం రావడంతో వారు బయటకు పరుగుతీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ నేతల హరిబాబు బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇళ్ల స్థలాలు ఇవ్వక పోవడం, ఇంటి రుణాలు అందజేయక పోవడంతో ఇరుకు ఇళ్లలో మూడు నాలుగు కుటుంబాలు జీవిస్తున్నాయని హరిబాబు తెలిపారు.

పెట్రోల్ బంక్‌పై దాడులు

కాకినాడ రూరల్: వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో పెట్రోల్ బంక్‌పై మంగళవారం నాలుగు శాఖల అధికారులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా బంక్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్, తూనికలు కొలతలు, సివిల్ సప్లయిస్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు శ్రీ అయ్యప్ప ట్రేడర్స్ బంక్‌పై దాడులు చేశారు. శాంపిల్స్ సేకరించి, రికార్డులు పరిశీలించారు. తాము మెరైన్ ఫ్యూయల్ విక్రయిస్తున్నామని దీనికి లైసెన్స్ అవసరం లేదని నిర్వాహకుడు తెలియజేయడంతో అధికారులు జీవోలు రప్పించి పరిశీలిస్తున్నారు. పెట్రోల్ ఉత్పత్తులు ఉండే కేసు కోణంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ విక్రయాలను నిలిపివేశారు.

వైభవంగా పైడితల్లి జాతర


పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: పట్టణం మంగయ్యమ్మరావుపేటలో వెలసిన గ్రామ దేవత పైడితల్లెమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విద్యుద్దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.


జీవనోపాధి లేక అల్లాడుతున్నాం

- సమస్యలపై రోడ్డెక్కిన మత్స్యకారులు
- పరిష్కారం అయ్యే వరకూ ఆందోళన
- పరిహారం ఇవ్వాలి.. లేదా పరిశ్రమలు మూసివేయాలని డిమాండ్


ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి: రాష్ట్రంలోనే అత్యధికంగా మత్స్యకారులు ఉన్న తీరప్రాంతంలో చేపల వేటే వారికి జీవనాధారం. ఆరు నెలలుగా చేపల వేట లేకపోవడంతో ఆ కుటుంబాలు జీవనోపాధి లేక అవస్థలు పడుతున్నారు. తీరప్రాంతంలో నిర్మిస్తున్న పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యం వల్ల జీవనోపాధి కోల్పోయామని ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో మంగళవారం అమీనాబాదు గ్రామ మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించారు. పరిశ్రమలు మాకొద్దు మా జీవన ఉపాధే ముద్దంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళనలో పాల్గొన్నారు. జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని లేని పక్షంలో కాలుష్య పరిశ్రమలు మూసివేయాలని డిమాండు చేశారు. ఆందోళన వద్దకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వచ్చి హామీ ఇచ్చే వరకూ ఆందోళన కొనసాగుతుందన్నారు.


పవన్ రావాలి.. హామీ ఇవ్వాలి..



వేటే జీవనాధారమైన మత్స్యకారులకు కాలుష్య పరిశ్రమలు వారి ఉపాధిని దెబ్బ తీశాయి. తమ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం వచ్చి హామీ ఇవ్వాలి. ఈ పరిశ్రమల వల్ల రానున్న రోజుల్లో ఎప్పటికైనా మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలుగుతుంది.

– కారే చిట్టిమ్మ, ఉప్పాడ


సమస్యలు పరిష్కరించేవరకూ..



జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు పరిహారం ఇచ్చే వరకూ ఆందోళన విరమించేదే లేదు. పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో స్థానిక మత్స్యకారులకు పరిహారం అందించాలి. మత్స్యకార ఆయా పరిశ్రమల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– మేరుగు యల్లాజీ, ఎంపీటీసీ, ఉప్పాడ

పార్టీలకు అతీతంగా ఆందోళన



మత్స్యకారుల జీవనోపాధిపై ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ఆందోళనలో పాల్గొనాలి. ఆందోళన వద్దకు వచ్చి మత్స్యకారులందరి సమక్షంలో ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ హామీ ఇచ్చే వరకూ ఆందోళన కొనసాగిస్తాం. ఆందోళను నీరు గార్చే ప్రయత్నం చేసి మత్స్యకారుల పొట్ట కొట్టొద్దు.

– గోగు బుజ్జి, మత్స్యకారుడు. సుబ్బపేట